కథ

# అందమైన సంధి


- వలివేటి నాగచంద్రావతి

సన్నజాజుల మాల జడలో తురుముకోబోతూ దోసిట్లోకి తీసుకుని గాఢంగా ఆఘ్రాణించింది సంయుక్త. నిజానికి పువ్వులు పెట్టుకోవటం ఇష్టం ఉండదు తనకి. జడ కూడా వేసుకోదు. క్లిప్ పెట్టి వదిలేస్తుంది. కానీ చక్రవర్తికి జడా, జడలో పువ్వులూ ఇష్టం. అందుకని సాయంత్రాలు తన ఇష్టాన్ని పక్కన పెట్టేస్తుంది.

చక్రవర్తీ సంయుక్తా ఏడాదిక్రితం పెళ్ళయిన యువజంట. చిరుద్యోగులు కూడా. సంయుక్త పనిచేసే ఇన్‌స్టిట్యూట్ వాళ్ళుంటున్న ఇంటికి చాలా దగ్గర. అందుచేత సాయంత్రాలు తనే ఇంటికి ముందొచ్చేస్తుంటుంది. రాత్రికి వంటా వగైరా ముగించుకుని తనూ తయారయి భర్త కోసం ఎదురుచూస్తూంటుంది రోజూ.

ఈరోజు ఆ ఎదురుచూపుల్లో ఓ తొందర, ఓ ఉత్సాహం కలిశాయి. బైకు శబ్దం వినబడగానే కాళ్ళకు రెక్కలొచ్చిన తూనీగలా ఎదురు వెళ్ళింది చక్రవర్తికి. ఆమె అలా తనకోసం ఆత్రపడ్డం అతనికి ఇష్టం- పనిభారం తగ్గిన ఫీలింగొచ్చేస్తుంది మరి.

కానీ ఇవ్వాళ్టి సంయుక్త ఉత్సాహం రోజూ కంటే మోతాదుకి మించున్నట్టు పసిగట్టేశాడు చక్రవర్తి. "క్యా బాత్ హై" అన్నాడు మందహాసంతో.



"పద చెబుతా" హెల్మెట్ అందుకుంటూ అంది సంయుక్త.

స్నానంచేసి రిలాక్సయిన చక్రవర్తికి టీకప్పందిస్తూ "ఎల్లుండి మనం టూర్‌కి వెళుతున్నామోచ్" అంది ఊరిస్తున్నట్టు.

"టూరా? " సంయుక్త చేయి పట్టుకు లాగి సోఫాలో తన సరసన కూర్చోబెట్టుకుంటూ అడిగాడు చక్రవర్తి.

"అవును. మా ఇన్‌స్టిట్యూట్‌వాళ్ళు రిక్రియేషన్ టూర్‌ప్రోగ్రాం వేస్తున్నారని ఓసారి చెప్పాను గుర్తుందా- అది ఇప్పుడు కన్‌ఫర్మ్ అయింది. ఆ సీషోర్ దగ్గర ప్రశాంతీ రిసార్ట్ లేదూ- దాన్లో టూడేస్ ఎంజాయ్ చేసొస్తున్నాం, ఫ్యామిలీతో సహా సుమా" అంది హుషారుగా.

టీ సిప్ చేస్తూ వింటున్నాడు చక్రవర్తి.

"మానటానికి ఎవ్వరూ ఏ వంకా చెప్పగూడదని స్ట్రిక్ట్ ఆర్డర్స్. మీ పార్ట్‌నర్స్‌ని కన్విన్స్ చెయ్యటంలో ప్రతిభ చూపించమని ఎడ్వైజ్. ఫైనాన్స్, మిగతా అరేంజ్‌మెంట్స్ అన్నీ మేనేజ్‌మెంటే చూసుకుంటుంది. వింటున్నావా? " మగని భుజంపట్టి ఊపింది సంయుక్త.

"ఊ ఊ" అన్నాడు చక్రవర్తి.

"ఊఊ కాదు. సాటర్‌డే నీకెలాగూ హాఫ్‌డే. ఆ సగంపూటా సెలవ్ పెట్టెయ్. సరిపోతుంది. ఆదివారం రాత్రికల్లా వచ్చేస్తాం. సరేనా."

"చూద్దాం" తేల్చీ తేల్చనట్టు అలా అన్నాడే గానీ వెళ్ళటానికి పెద్ద అభ్యంతరమేదీ లేదు చక్రవర్తికి. వీకెండ్‌లో విశ్రాంతి. ఇష్టసఖితో విహారం సరదాగానే ఉంటుంది.

"చూద్దాం కాదు. మనం గ్యారంటీగా వస్తున్నామని చెప్పేశాను మా బాస్‌కి. ఇంకేం మాట్లాడొద్దు" తేల్చేసింది సంయుక్త అధికారికంగా.

తన అభిమతానికి వ్యతిరేకం కాసంతవరకూ ముద్దుముద్దుగా సాగించే సంయుక్త పెత్తనం అతనికి ఇష్టమే. మురిపెంగా నవ్వాడు చక్రవర్తి. దాంతో అర్థమయిపోయింది సంయుక్తకి - వెళ్ళటం ఖాయమయిపోయినట్టేనని.

సంతోషం ఎక్కువయిందంటే ఇక నోటికి మూత పడదు సంయుక్తకి. వెళ్ళేటప్పుడు తీసుకెళ్ళాల్సిన వస్తువుల్తో మొదలుపెట్టి, అక్కడ ఆడబోయే ఆటలూ చేయబోయే సందడీ రాత్రి నిద్రపోయేదాకా చక్రవర్తి చెవి దగ్గర చెబుతూనే ఉంది. అతను 'ఊ' కొట్టడం ఆపేశాగ్గానీ ఆమెకి నిద్రపట్టలేదు.

★ ★ ★

'అనుకున్నదొకటి 'అయినది. ఒకటీ బోల్తా...' ఎక్కణ్ణుంచో గాలిలో తేలివస్తూ వినిపిస్తోందో పాతపాట. సిస్టమ్ ముందు కూర్చుని దాన్నే సన్నగా హమ్ చేసుకుంటూ వర్క్ చేసుకుంటోంది సంయుక్త.

సెల్ మోగింది. పక్కకి తిరిగి సెల్ చేతిలోకి తీసుకుంటూ చూసింది.

అటువైపున చక్రవర్తి. "సారీరా సాకీ. నాకు లీవ్ దొరకదు."

"ఎందుకని? " కీచుగా అడిగింది సంయుక్త.

"ఇయరెండింగు దగ్గరకొచ్చేస్తోంది. వర్క్ చాలా పెండింగులో ఉండిపోయింది. 'సండేలు కూడా వచ్చి పనిచేయండి' అని పొద్దున్నే అల్టిమేటం జారీచేశాడు మా ఎండీ. ఇంకిప్పుడు సెలవేం అడగను? " చక్రవర్తి కంఠం చాలా నిరుత్సాహంగా ఉంది.

నీరసమొచ్చేసింది సంయుక్తకి. "మరెలా? "

"ఏముంది. టూర్ క్యాన్సిల్. మీ బాస్‌కి చెప్పెయ్" చక్రవర్తి ఫోన్ పెట్టేశాడు.

దిగాలుపడి నిలుచుండిపోయింది సంయుక్త.

"వాట్ హ్యాపెండ్ సంయుక్తా? " అంది పక్కటేబుల్ సరిత.

చెప్పింది సంయుక్త - చక్రవర్తి హ్యాండిచ్చిన సంగతి. "మేం డ్రాపయిపోతున్నాం" అంది డల్‌గా.

"అరె, అతనికి కుదరకపోతే నువ్వెందుకు డ్రాపవడం? " సరితా, సంయుక్తా సంభాషించుకోవటం చూసి దగ్గరకొస్తూ నుదురు చిట్లించడిగింది శ్యామల.

"అతను లేకుండా నేను రావటమా - ఊహు నాకు నచ్చదు" అంది సంయుక్త.

"ఎందుకని? "

"నీకర్థంకాదులే" నవ్వేసింది సంయుక్త.

"ఇక్కడే నాకొళ్ళు మండేది. నాకర్థం కాకపోవటానికి నువ్వు మాట్లాడేదేమన్నా శిష్టగ్రాంధికమా. ఈమధ్య పతిదేవుళుంగారి చిటికిన వేలు పట్టుకునిగానీ ఎక్కడికీ కదల్లేకపోతున్నారు- అంతేగా తమరి తాత్పర్యం."

సంయుక్త మధురంగా నవ్వింది.

"అలా నవ్వకు. నాకు తిక్కరేగుతుంది.

పెళ్ళయ్యాక నువ్వు చాలా మారిపోయావే సంయుక్తా. మాతోపాటు ఓ సినిమాగ్గానీ షాపింగుగ్గానీ వచ్చి ఎన్నాళ్ళయింది? ఎంత సేపూ హైపోక్లాకెప్పుడవుతుందా, ఎగిరెళ్ళి ఆ మానస చక్రవర్తి సమక్షంలో ఎప్పుడెప్పుడు వాలిపోదామా... అని తప్ప ఇంకో ధ్యాసుంటోందా నీకు? మొగుడంటే ఎంత ప్రేమొలికిపోతున్నా మరీ అంత అతుక్కుపోగూడదే అమ్మడూ. తొందరగా మొహమ్మొత్తిపోగలవ్ నిష్ఠూరంగా అంది శ్యామల.

"సరే, అదంతా ప్రస్తుతానికి పక్కనపెట్టు. ఇట్లాంటి అకేషనప్పుడు కూడా మా ఆయన్ని వదిలి రాలేనూ అంటూ తప్పించుకోవాలని చూశావంటే మాత్రం అస్సలూరుకోమంటే ఊరుకోం" తర్జని ఊపుతూ అంది సరిత.

సరితా, శ్యామలా సంయుక్తకి ఇన్‌స్టిట్యూట్‌లో మాత్రమే దోస్తులు కాదు. హైస్కూలు నుంచీ కూడా క్లాస్‌మేట్స్. అందుచేత చనువెక్కువ.

సంయుక్త మెత్తబడింది. "అదికాదు, చక్రవర్తి ఏమంటాడో..." అంది సందేహంగా నసుగుతూ.

"ఏమంటాడు- వద్దంటాడా? అంత నేరో మైండెడా నీ చక్రవర్తి?" విసురుపోతున్నట్లడిగింది సరిత.

"ఛ ఛ, అతనలాంటివాడు కాదు. నువ్వు మరీ ప్రతి మాటకీ పెడర్థం తీస్తావ్" విసుక్కుంది సంయుక్త.

"ఉహూ, ఇది ఇలా నానుస్తూనే ఉంటుంది గానీ మనం వెళ్ళి ఆ చక్రవర్తిగారితోనే లైన్‌క్లియర్ చేయించుకొచ్చేద్దాం" తీర్మానించేసింది శ్యామల.

అన్నట్టుగా ఆ సాయంత్రమే చక్రవర్తి మీద దాడిచేశారు శ్యామలా, సరితా.

"ఆరె, అవును కదూ. నాకు వీలవకపోతే తను మానటమెందుకూ?" అన్నాడు చక్రవర్తి తెల్లబోతూ.

"మరి మీరు టూర్ క్యాన్సిల్ చేసుకోమనీ..." అర్థోక్తిలో ఆపింది శ్యామల.

"అలా అన్నానా" మళ్ళీ ఆశ్చర్యపోయాడు చక్రవర్తి. ఒక్కక్షణం ఆగి నిదానంగా అన్నాడు "నా దృష్టిలో సంయుక్తా నేనూ ఇద్దరంకాము. ఒక్కరమే. ఆ థింకింగ్‌తో నాకే తెలీకుండా తనని కూడా కలిపేసుకుని ఈ ట్రిప్ క్యాన్సిల్ అనేసి ఉంటాను. సారీ" అన్నాడు పశ్చాత్తాపపడుతోన్నట్టు.

'భర్త అంటే ఇలా ఉండాలి' సరిత అతన్ని ఆరాధనగా చూసింది.

"పోన్లెండి. అది వదిలేయండి. ఇప్పుడు సంయుక్త విడిగా మాతో వచ్చేందుకు మీకు అభ్యంతరంలేదుగా. అది ఆనందిస్తే అందులో సగభాగం మీకూ అందుతుందిగా" శ్యామల గడుసుతనం చూపించింది.

"డెఫినెట్లీ" గొంతులో నిజాయతీ స్పష్టంగా వినిపించే ప్రయత్నం చేశాడు చక్రవర్తి.

అంతేకాదు, ఆ రాత్రి తనే స్వయంగా ఇన్‌



స్టిట్యూట్‌వాళ్ళతోపాటు సంయుక్తనీ బస్ ఎక్కించి, కదిలేదాకా ఉండి చిరునవ్వుతో చెయ్యూపి, బై చెప్పి......

★ ★ ★

బస్ కనుచూపుమేర దాటింది. వెనక్కి తిప్పాడు బైకుని చక్రవర్తి నీరసంగా.

అరె ఏమిటిది? ఉన్నట్టుండి థైరాయిడ్ గ్రంథికి మందకొడితనం ఆవరించినట్టు ఇంత నిరుత్సాహంగా ఉందేం? ఇల్లెక్కడ వచ్చిన వచ్చేస్తుందో అన్నట్టు బైకు కూడా స్పీడు తగ్గిపోయిందేమిటీ?

అవున్నిజమే. ఇప్పుడా ఇంట్లో సంయుక్త లేకుండా ఉండాలంటే ఏమిటో ఒంటరొంటరిగా ఖాళీఖాళీగా అనిపిస్తోంది మనసుకి. అసలిప్పుడు ఇంటికెళితే నిద్రపడుతుందా అని.

ఏమిటీ పిచ్చితనం. ఏడాదిక్రితం ఈ అందాల రాక్షసి తన ఇంట్లోకీ తన గుండెల్లోకీ వచ్చేదాకా తను ఒక్కడే హాయిగా ఉండేవాడు కాదూ. ఎంత ఆనందంగా ఎంత హుషారుగా ఉండేదా రోజుల్లో- స్నేహితులూ సినిమాలూ బీర్లూ.

ఆ ఆ అవును. ఇప్పుడొక్క బీరు బిగిస్తే ఈ డల్‌నెస్ అంతా తుడుచుకుపోదూ. ఒళ్ళంతా తేలికై ఏ కలల రాజ్యానికో ఎగిరిపోదూ- ప్చ్, ఇంత గొప్ప బెవడాన్ని ఎలా మరచిపోయా డబ్బా, అప్పే, తనెక్కడ మరచిపోయాడూ... ఆ రాక్షసి- అదే తన పెళ్ళాం వాటి ఊసు వస్తేనే వాంతి చేసుకునేటట్టు మొహం పెడుతుంది. బీరు తాగినవాళ్ళని కూడా తాగుబోతులే అంటుంది. వాటి జోలికి పోగూడదని ఆవిడగారి ఆంక్ష. అది మీరలేకపోవటం తన బలహీనత.

హ్చ్, తనమీద ఈవిడకేమిటి ఈ దాష్టీకం. ఇవ్వాళ తను ఓ బీరు తాగేతీరతాడు. అదిగో వైను షాపు. అక్కడో బీరు కొంటాడు. ఇంటికి వెళ్ళి తాగుతాడు. హాయిగా నిద్రపోతాడు. చక్రవర్తి బైకు స్లో చేశాడు.

వైన్‌షాపు వచ్చేసింది. బైకు ఇంకా స్లో అయింది. కానీ ఆగదేం. చక్రాలకింద గోళీకాయలు పోసినట్టు అలా ముందు దొర్లిపోతుందేం? కళ్ళముందు ఆ అందాల రాక్షసి వెగటుగా పెట్టిన మొహమే కనపడుతోందేం? అయ్యయ్యో వైనుషాపు దాటిపోయింది. ఇల్లు కూడా దగ్గరకొచ్చేసింది.

చక్రవర్తి తాళం తీశాడు. ఉస్సూరనుకుంటూ అయినా విప్పకుండా మంచానికి అడ్డంపడ్డాడు. మనసంతా చికాకు చికాగ్గా ఉంది. తన్నింత వశపరిచేసుకున్న ఆ ఇరవై ఏళ్ళ పిల్లమీద గొంతుదాకా కోపమొచ్చేస్తోంది. ఇంతచేటు వశపడిపోయిన తనమీద తనగ్గూడా కోపమొచ్చేస్తోంది చక్రవర్తికి.

అలిగిన పిల్లవాణ్ణి బుజ్జగించి ముద్దుచేసే తల్లిలా అలిసిపోయిన అతన్ని నిద్రమ్మ దగ్గరకు తీసి లాలించింది.

తెల్లారింది. పాలపాకెట్టూ పేపరూ వచ్చేశాయి. నిద్రమంచం మీదుండగానే కుడిచేతికి కాఫీకప్పూ ఎడంచేతికి పేపరూ అందించేవాళ్ళు ఊరెళ్ళారని మెలకువతోపాటు జ్ఞాపకమూ వచ్చింది చక్రవర్తికి.

హ్చ్, ఆవిడగారు లేకపోతే రోజు గడవదా' హుంకారం చేసి లేచాడు చక్రవర్తి.

అగ్గిపెట్టె కోసం అయిదు నిమిషాలు వెతికి హైరానా పడిన తరవాతగానీ గ్యాస్‌స్టవ్ లైటర్‌తో వెలిగించాలన్న విషయం తట్టలేదు. పాలు కాగే లోపల బ్రూ సీసా, పంచదార డబ్బా వెతికి పట్టుకోవటం అతనివల్ల కాలేదు.

హ్చ్, ఈ సంయుక్తకి అసలు బుద్ధిలేదు. చెలికత్తెలు రమ్మనంగానే తెయ్యిమంటూ ఎగిరెళ్ళిపోవటమేగానీ అయ్యో పాపం, పొద్దున్న లేస్తే మొగుడన్న ఓ ప్రాణి ఎన్నిటికి అల్లాడతాడో ఏమిటో, కావలసినవన్నీ కాస్త ఎదురుగుండా పెట్టి వెళదాం అన్న జ్ఞానమున్నా లేదు' అని లోలోపల రుసరుసలాడాడు.

ఆ కోపంలోనే స్టవ్ ఆర్పేశాడు. తరవాత హోటల్‌కి వెళ్ళిపోయాడు. కాఫీ, టిఫిన్ ముగించుకుని ఇంటికొచ్చేలోపల పెళ్ళయిన ఈ ఏడాదిలో సంయుక్త తనని ఇబ్బంది పెట్టిన సందర్భాలన్నిటినీ వెతికివెతికి గుర్తుచేసుకుని కళ్ళాదరలేని ఆ గడుసు రాక్షసిని సతాయించుకుంటూనే ఉన్నాడు.

తీరాజేసి ఇంటికిరాగానే కన్పించింది- పేస్టే

## కలం కదిలించండి

సృజనాత్మకత కలిగిన రచయితలకూ రచయిత్రులకూ ఇదే ఆహ్వానం. మానవ జీవితంలోని విభిన్న పార్శ్వాలను స్పృశిస్తూ మధురమైన అనుభూతులను పాఠకులకు పంచే కథలకు 'ఈనాడు' స్వాగతం పలుకుతోంది. భావం ఏదైనా కథనంలో వైవిధ్యం, పాఠకులను ఏకబిగిన చదివింపగలిగే బిగువూ ఉండాలి. ఆశావహ దృక్పథంతో సాగే కథలకు ప్రాధాన్యం. కథ సాధారణ చేతి రాతలో ఏడు అరఠావులకు మించకూడదు.

కథలు పంపాల్సిన చిరునామా:

ఆదివారం అనుబంధం
ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ,
హైదరాబాద్-82.

టేకి స్టిక్‌చేసి పెట్టిన స్లిప్.

కాఫీపొడీ పంచదారా ఎక్కడున్నాయన్న వివరమే కాదు- కాఫీ కలుపుకోవటమెలాగో రాసి పెట్టిందందులో. ఫ్రిజ్‌లో రెండు కూరలూ సాంబారూ చేసి పెట్టిందట. కాస్‌రోల్‌లో పుల్కాలున్నాయట. ఏవయినా సరే, ఓవెన్‌లో రెండు నిమిషాలు వెచ్చబెట్టుకుంటే చాలునట. ఇస్త్రీ చేసి పెట్టిన డ్రస్ బీరువా తెరవగానే కనిపించింది. షూ పాలిష్ చేసింది. సాక్సు ఆ పక్కనే పెట్టింది.

'ఉద్ధరించింది' కసిగా అనుకున్నాడు చక్రవర్తి. పైకి ఒప్పుకోబుద్ధికాదుగానీ ఇంకా ఇంకా తిట్టుకునేందుకు అవకాశం లేకుండాపోయినందుకు పుట్టుకొచ్చే ఉడుకుమోత్తనమది.

ఆఫీసుకు వెళ్ళిన తరవాత కూడా ఆ ఆగ్రహాన్ని కించిత్తు కూడా తగ్గకుండా కంటిన్యూ చేశాడు చక్రవర్తి. దానికితోడు పని ఒత్తిడి. ఆ టెన్షన్‌లో జరిగిన పొరపాట్లు, తప్పులు. స్ప్రింగ్‌డోర్ వెనకున్న పెద్దతలకాయతో మంద లింపులు, చివాట్లు. అతని కాక తరగకుండా ఎగసన తోశాయి.

రెండుసార్లు సంయుక్త చేసిన కాల్స్‌ని కట్ చేసేశాడు. 'హు, నేనిక్కడ పీకల్లోతు పనిలో కూరుకుపోతూంటే తానక్కడ ఎంజాయ్ చేస్తోంది. హు, నేను రాకపోతే రానని చెప్పెయ్యొద్దూ. హు, ఎందుకు చెబుతుందీ, ఒళ్ళంతా పొగరు. హు, పైగా మూలిగేవాణ్ణి బాగున్నావా అని పరామర్శించినట్టు పలకరించటానికన్నట్టు ఫోను' అని కుతకుతలాడాడు.

సముద్రతీరంలో కెరటాలతో కేరింతలు కొడుతూ ఆడుకుంటున్న సంయుక్తనీ వెంట ఉంటూ ప్రోత్సహిస్తున్న కొలీగ్స్‌నీ ఊహించుకుని అసహనంగా స్విచాఫ్ చేసేశాడు మూడోసారి. చివరికి మెసేజ్ కూడా చూడలా.

★ ★ ★

'మీరు డయల్ చేసిన నంబరు ప్రస్తుతము స్విచాఫ్‌లో ఉన్నది. దయచేసి తరవాత ప్రయత్నించండి.'

సెల్ పక్కనపెట్టి నిరాశగా నిట్టూర్చింది సంయుక్త. 'పాపం, ఎంత బిజీలో ఉన్నాడో. సెల్ కూడా ఆఫ్‌చేసి పెట్టుకున్నాడు.'

పొద్దుట్నుంచీ మగని మధుర మందహాస స్వరం వినబడక చాలాచాలా డిజప్పాయింటింగ్గా ఉంది సంయుక్త. ఎంత అన్యమనస్కంగా ఉంటోందంటే మ్యూజికల్ ఛైర్స్ గేమ్‌లో ఫస్టు సీటు పోగొట్టుకున్నది సంయుక్తే. కడలి తుంపర్లలో అందరూ చిందులు వేస్తోంటే, వాళ్ళకు ఫొటోలు తీసే మిష మీద దూరంగా ఉండిపోయిందీ ఆమే. పేకాట ఆడేటప్పుడు పరధ్యానంలో సీక్వెన్స్‌లు పడేస్తుంటే 'నిన్ను అనవసరంగా లాక్కువచ్చామే' అని చెంపలేసుకుంది శ్యామల.

గెస్ట్‌హౌస్‌లో రాత్రి తెల్లవార్లూ మెసులుతూనే ఉంది నిద్రపట్టక. మర్నాడు సైట్‌సీయింగ్ పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణమవటానికి మాత్రం తెగ ఉత్సాహపడిపోయింది.

"బోరా" అంది సరిత- వాళ్ళ అమ్మమ్మ మోస్తరు ముక్కున వేలేసుకుంటూ.

★ ★ ★

రాత్రి తొమ్మిదిన్నరయింది ఇంటిముందు సంయుక్త ఆటో దిగేసరికి. కాలింగ్‌బెల్ నొక్కి నలభైఎనిమిది గంటల ఎడబాటు ముగిసిన ఆనందాన్ని ముఖ మందహాసంలో నింపి మరీ నుంచుంది.

తలుపు తీశాడు చక్రవర్తి. కానీ భార్య రువ్విన నవ్వందుకోలేదు. యంత్రవతుగా 'హాయ్' అనేసి వెనక్కి తిరిగాడు.

చివుక్కుమనిపించినా 'అలక్ష్యం కాదది. వర్క్ హెవీ అయిన అలసట అయ్యుంటుంది' అని సరిపెట్టేసుకుంది. తను గలగల మాట్లాడుతున్నా 'ఊ' కొట్టకుండా శ్రద్ధగా టీవీ చూడటంలో మునిగిపోయుంటే 'ఏదో ఇంట్రెస్టింగ్ ప్రోగ్రామ్ అయ్యుంటుం'దనుకుంది.

"ఒక్క అయిదు నిమిషాలు. నేను స్నానం



చేసొచ్చి వంట చేసేస్తాను" అనంటే, "నేను తినేశాను" అని ముక్తసరిగా చెప్పి గదిలోకి వెళ్ళిపోతోంటే, తన భోజనం గురించి ఒక్క మాటయినా అతను అడగనందుకు ఆశ్చర్యపడింది.

సంయుక్త స్నానంచేసి వచ్చేసరికే చక్రవర్తి మంచంమీద ముసుగు బిగాయించేశాడు.

"అప్పుడే నిద్రా? " అంది పక్కనచేరి.

"ఊ" ఒక్క మూలుగు మూలిగి పక్కకి తిరిగిపోయాడు.

"నువ్వింకా అక్కడి విశేషాలు అడుగుతావని నేనెక్స్‌పెక్ట్ చేస్తోంటే నువ్వేమో..." అంది సంయుక్త గుణుషుగా.

"నాకు తెలీని విశేషాలేముంటాయ్? నువ్వేమో నీ స్నేహితురాళ్ళతో కలిసి అదుపు లేకుండా గెంతుంటావ్. మీ కోతిమూక కొలీగ్స్‌మో వెకిలి చేష్టలు చేసి రెచ్చిపోయుంటారు. అంతేగా. అవన్నీ సరదాగా వినే మూడ్ లేదు నాకు."

ఎంత కఠినమైన మాటలు... విదిలించిన కొరడా చివర్లు తగిలిన గొర్రెపిల్లలా విలవిల్లాడింది సంయుక్త.

"చక్రీ..."

"ఛుప్, అలా పిలవకు. నాకు మండుతుంది. అసలు నీకు కామన్‌సెన్సుందా. వాళ్ళంటే పెళ్ళికాని పిల్లలు. సీతాకోకచిలుకల్లా ఎక్కడికైనా ఎగురుతారు. ఎవరితోనైనా ఆడతారు. పెళ్ళయినదానివి నువ్వూ వాళ్ళ వెనకాలే పరిగెడతావా - బుద్ధుండక్కర్లా."

"నువ్వేగా వెళ్ళమన్నావ్" రోషంగా అంది సంయుక్త.

"అవును. నేనలాగే అంటాను. అనాలి. నువ్వే గ్రహించుకోవాలి. రానని చెప్పెయ్యాలి. అంతే."

మగ అహంకారం కాదూ అది... విస్తుపోయింది సంయుక్త.

"నీకింకో మొహమూ ఇంకో నాలుకా ఉన్నాయని నాకు తెలీదు" అటు తిరిగిపోయింది సంయుక్త.

అప్పుడే ఎండలోంచి తీసుకొచ్చి వేసినట్టు పరుపు కాలిపోతున్నట్టనిపిస్తోంది. అంతే ఆట అంతే. ఎంత అహంకారం. ఎంత ఇరుకు మనసు. ఫ్రెండ్స్‌తో ఒక్కరోజు పిక్నిక్కుకు వెళ్తే తప్పా? భార్యనయినంత మాత్రాన తప్పు లేకపోయినా అతని ముందర తల వంచాలా? నెవ్వర్. తనకేం తక్కువని ఈ జులుం భరించాలి. చదువుంది. సంపాదనా ఉంది. సీతమ్మవారి కాలం కాదని తెలియజెబుతుంది. ఆత్మగౌరవం చంపుకుని ఎందుకుండాలిక్కడ? రేపే అమ్మగారింటికి వెళ్ళిపోతుంది.

భరించలేనంత వేదన తట్టుకోలేక మెదడు విశ్రాంతి కోరుకుంది. కళ్ళు మూతలుపడ్డాయి సంయుక్తకి.

★ ★ ★

చల్లగా మెత్తగా నడుముని చుట్టిన భర్త చేతిస్పర్శకి చటుక్కున మేల్కొంది సంయుక్త. విదిలించాలనిపించలేదు. లోలోపల కోరుకున్న కోరిక అదేనేమో.

"సాకీ" చక్రవర్తి భార్యని పిలిచే ముద్దు పేరది.

మేలుకున్నట్టుగా కొద్దిగా కదిలి ఊరుకుంది సంయుక్త.

"సారీరా, నిన్ను చాలా బాధపెట్టాను కదూ. ఏం చెయ్యమంటావ్ చెప్పు. నువ్వు దూరంగా ఉండటం అనేది నాకు ఎంత కఠినమైన శిక్షో తెలుసా. నాలో సగభాగాన్ని ఎవరో తొలిచేసినట్టు ఖాళీగా వెలితిగా... ఆ కొరతని మాటల్లో వర్ణించలేను. ఈ రెండురోజులూ ఆ నరకం అనుభవించాక నిన్ను చూసేసరికి గొప్ప రిలీఫ్. దాంతోపాటు అదోరకం అక్కసు. నాపాటికి నన్నొదిలేసి హాయిగా నవ్వుతోందే అని పిచ్చిపిచ్చిగా వాగేశాను. ఒక్కరోజే అయినా సరే నిన్ను వదిలి ఉండలేన్రా. అర్థం చేసుకోవూ" చక్రవర్తి కంఠం మంద్రస్థాయిలో గాయానికి మందు వేస్తున్నట్టుగా ఉంది.

సంయుక్త నుదురు చక్రవర్తి హృదయానికి దగ్గరగా వచ్చింది.

"విడిపోయిన అర్ధభాగం ఎక్కడైనా ఎంజాయ్ చేయగలదా చక్రీ. అక్కడ నేనూ అంతే."

మరుక్షణం వాళ్ళిద్దరూ ఒక్కటే. ★